


# గెలుపు

**ఆయన పడబోతూ, పడబోతూ నిలదొక్కుకున్నాడు. ఆయన సిటీబస్సులోంచి దిగుతుండగానే డ్రైవర్ కాలితో యాక్సిలేటర్ నొక్కాడు. బస్సు వేగంగా ఊగిపోయింది. ఆయన తట్టుకుని పడబోయేవాడే. కానీ తక్కున ఎడమ చేత్తో బస్సు కమ్మీ పట్టుకున్నాడు. ఆయన కుడిచేతిలో పుస్తకాల బండిల్ వుంది. ఎడమ చేతిలో నల్లని కొయ్య ఊత కర్ర. ఆయన బస్సు కమ్మీ పట్టుకోగానే కొయ్య ఊత కర్ర కమ్మీకి గట్టిగా తగిలింది. 'ఖంగ్' మని శబ్దం వినిపించింది.**

ఆయన తట్టుకుని కిందపడిపోయాడనీ, ఆయన నముడు ఎముకలు విరిగి వుంటాయనీ, వెనుక కూర్చున్న ప్యాసింజర్లు భావించారు. వారు ఉత్సుకతతో బయటికి తొంగిచూడసాగారు. కానీ ఆయన దిగి, పుస్తకాల బండిల్ చంకలో పట్టుకుని ఊతకర్ర సహాయంతో, ఎంతో ఆత్మవిశ్వాసంతో ముందుకు పోతున్నాడు.

బస్సులో కూర్చున్న ప్యాసింజర్లకు శూన్యంగా వున్న వారి మెదడును ఎవరో కుదిపేసినట్లనిపించింది. ఆయన తట్టుకుని కిందపడాలనీ, దెబ్బ తగిలించుకుని డ్రైవర్‌ను తిట్టాలనీ వారు మనసులో కోరుకుంటున్నారు. కానీ అలా ఏమీ జరగలేదు. బొత్తిగా ఏమీ జరగనట్లే, ఆయన నిర్భయంగా వెళుతూండడం చూసి, కోరుకున్న వస్తువేదో చేతికి అందినట్లే అంది, వూహించని సంఘటనకు కిందపడిపోయి ముక్కలు ముక్కలైనట్లు వారికి అనిపించింది. ఒకవేళ కమ్మీ ఆయనకు అందకపోయినా, బస్సు ఒక్కసారిగా వేగం పుంజుకున్నా, ఆయన తప్పక కింద పడిపోయేవాడని వారనుకున్నారు. డ్రైవర్ ఇంకా గట్టిగా యాక్సిలేటర్ నొక్కాల్సింది. కానీ అలా జరుగలేదు. డ్రైవర్ అలా చేయనందుకు వారెంతో బాధపడ్డారు.

చూస్తూ వుండగానే ఆయన ఎదురుగా వున్న లైబ్రరీ చేరుకున్నాడు. ఒక మనిషి భుజంమీద చేయివేసి నవ్వుతూ ఎంతో ఉత్సాహంగా మెట్టెక్కుతున్నాడు. ఇదంతా చూసి, ముందుగానే చింతిస్తున్న ప్యాసింజర్లు మండిపడ సాగారు. ఏదో భూతం నోరు తెరుచుకుని తమని వెంబడిస్తున్నట్లు వారు దిగులుగా కనిపించారు. బస్సు వేగం పుంజుకుంది. ఎంతో సేపు ఇలా చింతిస్తూ బాధపడటం వ్యర్థమని వారికి అనిపించింది. ఈ పరిస్థితి నుంచి తేరుకునే ప్రయత్నంలో వారు ఒకరినొకరు చూసుకుని చిరునవ్వు నవ్వారు. కొందరు తువ్వాలు తీసుకుని తమ నొసలు తుడుచుకోసాగారు. మహిళలు గుసగుసలాడుతూ కిలకిలా నవ్వారు. మిగిలిన ప్యాసింజర్లు మధురమైన చిరునవ్వు ఆపి, మహిళల సంతోషంలో తామూ పాలు పంచుకోవాలనుకుంటున్నట్లు, వారివైపు తిరిగి చూశారు. బస్సంతా కొంచెంసేపు ఉత్సాహం, సంతృప్తి ఉరకలేసింది. బస్సులో కూచున్న ఆ అపరిచితులైన ప్యాసింజర్లను ఈ సంఘటన పరస్పరం దగ్గరగా చేర్చింది. తామంతా సహ యాత్రికులమనీ, సహ భోక్తలమనీ, ఒకేరకమైన మనోభావాలు పంచుకుంటున్నామనీ ఫీలయ్యారు.

హిందీ మూలం:
డా॥ పోలి విజయ రాఘవరెడ్డి
తెలుగు అనువాదం:
కొమ్మిశెట్టి మోహన్

ఆయన బస్సులో కూచుని వున్నంతవరకు అందరూ ఆయనవైపే చూస్తూ వున్నారు. కొంతమందికి నవ్వువస్తోంది. కొంతమంది లోలోపలే విసుక్కున్నారు. మరికొందరు గంభీరంగా చూస్తూ వున్నారు. కానీ ఆయన బస్సులో వున్నంతవరకు చిరునవ్వు గానీ, సైగగానీ, తమ మనోభావమేదైనా మరొకరితో పంచుకోడానికి సాహసించలేదు. ఆయన అందరినీ ప్రభావితుల్ని చేశాడు. ఆయన ఉనికి వల్ల అందరూ ఇబ్బందిపడుతున్నారు. అందరూ మౌనంగా కూచుని వున్నారు. వారి భావాలు నియంత్రించబడ్డాయి. కానీ ఆయన దిగిపోయిన వెంటనే బస్సులోని ప్యాసింజర్లు అందరూ బంధవిముక్తులైనట్లు ఫీలయ్యారు. కొంతసేపు అందరిలో దిగులు పొరలు కప్పింది. కానీ ఇప్పుడు చిరునవ్వు పొరలు పొరలుగా వికసింపసాగింది.

టి.నగర్ టెర్మినస్‌లో ఆయన బస్సు ఎక్కేటప్పుడే కండక్టరు అన్నాడు, 'త్వరగా ఎక్కండి స్వామీ! బస్సు కదులుతోంది.' ఒక చేత్తో పుస్తకాల బండిల్, మరో చేత్తో నల్లని ఊతకర్ర పట్టుకుని ఆయన తక్కున ఎక్కి డ్రైవరు పక్కసీటులో కూచున్నాడు. కూచునేటప్పుడు అతని చేతిలోని నల్లని ఊత కర్ర జారి డ్రైవర్ కాళ్ళవద్ద పడబోయింది. ఇంతలోనే ఆయన దాన్ని జాగ్రత్తగా పట్టుకున్నాడు. డ్రైవర్ ఆయనవైపు కళ్ళప్పగించి చూశాడు. పుస్తకాల బండిల్ పక్కసీటు మీద వుంచి, ఆయన పర్సు తీశాడు. అందులోంచి కొన్ని పైసలు తీసుకుని కండక్టరుకోసం ఎదురుచూడసాగాడు.

బస్సు వేగంగా వెళుతోంది. ఆయన ఊతకర్ర రెండు చేతుల్తో బలంగా పట్టుకున్నాడు. బస్సులో కూచున్న మిగిలినవారి చూపులు ఆయనపై నిలిచాయి. వారి చూపులకు ఆయన ఆకారం, లావుపాటి కళ్ళజోడు, అందులోంచి తొంగిచూస్తున్న చురుకైన చిన్న కళ్ళు, వారికి చిత్రంగా అనిపించాయి. ఆయన నొసట తిలకం వుంది. చేతులకు, ఛాతీ మీద విభూతి రాసుకున్నాడు. ఆయన మెడలో రుద్రాక్షమాల ధరించాడు. ఒక తెల్లని ధోవతి, పైన టవలు కప్పుకున్నాడు. తలమీద రెండే రెండు తెల్ల వెంట్రుకలు మిగిలివున్నాయి. ఆయన వయస్సు సుమారు ఎనభై-ఎనభైఐదు సంవత్సరాలుంటుంది. ఆయన వేషధారణ మద్రాసు నగర వాసులకు కొత్తకాదు. ఈ మహానగరంలో ఇలాంటి వేషధారణతో వేల సంఖ్యలో కాకున్నా, కనీసం వందల సంఖ్యలో రోజూ కనిపిస్తూ వుంటారు. అయినా వారు ఆయనవైపు విచిత్రంగా చూస్తూ వున్నారు. ఎవరో పరాయి దేశస్థుడు వారి మధ్యలో ఊడిపడ్డట్టుగా!

ఆ ఆకారంలోని స్ఫూర్తి, అసాధారణ చైతన్యం చూసి వారికి నిజానికి ఈర్ష్య కలుగుతోంది. ఆ ఆకారం వారి మెదడును నిర్విరామంగా తొలుస్తోంది. కానీ వారు తమ ఈర్ష్యను కప్పిపుచ్చుకోవడానికి చూపుల్లో ఆశ్చర్యం ప్రకటించే ప్రయత్నం చేస్తున్నారు. చాలాసేపటివరకు కండక్టరు రాలేదు. ఆయన అతన్ని గట్టిగా పిలిచాడు. కండక్టర్ రాగానే బ్రిటిష్ కౌన్సిల్ లైబ్రరీ వరకు టిక్కెట్టు తీసుకున్నాడు. టిక్కెట్టు తీసుకుంటూ ఆయన అన్నాడు, 'లైబ్రరీ దగ్గరకు వస్తూనే కొంచెం చెప్పండి.' ఆయన ఎదురుగా కూచున్న ఒక మధ్య వయస్కుడన్నాడు, 'ఆర్ట్స్ కాలేజీ స్టాప్ వద్ద దిగిపొండి. దానిపక్కనే బ్రిటిష్ కౌన్సిల్ లైబ్రరీ వుంది.'

'మంచిది! ఆర్ట్స్ కాలేజీ రాగానే చెప్పండి.'

'సరే, చెబుతాను' ఆయన పక్కన కూచుని వున్న అబ్బాయి భరోసా ఇచ్చాడు.

పెద్దాయన నిశ్చింతగా వున్నాడు. ఆయన బయటికి తొంగి చూడసాగాడు. నగరంలోని సందడి, నిత్యమూ తయారవుతున్న ఎత్తైన భవనాలు, ఎడతెరిపి లేకుండా పరుగెడుతున్న కార్లు, జనసందోహం చూసి, ఆయనకు విచిత్రమైన ఆనందం కలుగుతోంది. యాభై-అరవై సంవత్సరాలకు పూర్వం తాను ఈ నగరంలో చదువుతున్నప్పటి నగరాన్ని పోల్చే ప్రయత్నం చేస్తున్నాడు. 'ఓహ్! నగరమెంత మారి

పోయింది. ఎంత రద్దీ పెరిగిపోయింది. అరె, నేనెంత మూర్ఖున్ని! యాభై, అరవై సంవత్సరాల కిందటికి ఇప్పటికి ఎక్కడైనా పోలిక వుంటుందా? ఐదు సంవత్సరాల కిందటి సంగతే తీసుకుందాం! అప్పుడు నేనే స్వయం గా లైబ్రరీకి వస్తూ వుండేవాన్ని. అక్కడే పుస్తకాలు చదివేవాన్ని. ఇంటికి తీసుకువెళ్ళేవాన్ని కూడా. అప్పటి నగరానికి, ఇప్పటి నగరానికీ పోలికే లేదు. ఎంత అభివృద్ధి చెందింది.

ఇలా ఎంతవరకు, ఎక్కడివరకు జరుగుతూ వుంటుంది. ఈరోజు నా మనుమని కుమారుడు లైబ్రరీలో పుస్తకాలు తిరిగిచ్చేసి, కొత్త పుస్తకాలు తీసుకురానన్నాడు. పాపం, వాడు నా కోసం గడచిన ఐదు సంవత్సరాల నుంచీ పుస్తకాలు తెస్తూనే వున్నాడు. ఈరోజు వాడు మంచిపనే చేశాడు. లేకుంటే మారిపోయిన ఈ నగరాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం నాకెక్కడ దొరికేది?

జెమినీ స్టూడియో వద్ద బస్సు చాలాసేపు ఆగింది. రోడ్డు పక్కన వున్న పెద్ద పెద్ద సినిమా పోస్టర్లను ఆయన తన లావుపాటి కళ్ళ జోడుతో పరిశీలనగా చూడసాగాడు. మనసులోనే చిన్నగా నవ్వుకోసాగాడు. బస్సు బయలుదేరింది. ఆయన చూపు ఎదురుగా వున్న పెద్ద భవనం మీద పడింది. ఆయన ఉత్సుకతతో పక్కన కూచున్న అబ్బాయినడిగాడు, 'ఇది ఎవరి ఇల్లు?'

'అమెరికన్ కౌన్సిలేట్ జనరల్ వారి ఆఫీసు.'

ఆ మాట విని ముసలాయన కళ్ళజోడు పైకెత్తి పరిశీలనగా చూశాడు. పక్కనే ఇంగ్లీషులో రాసిన పెద్ద నేమ్‌ప్లేట్ వుంది. పెద్దపెద్ద అక్షరాలు. దానికి తోడు అలవాటుపడిన అక్షరాలైనందున చదవడానికి ఆయనకు చెడ్డ కష్టమనిపించలేదు. ఒక్కొక్క అక్షరం కలుపుకుని గట్టిగా చదివాడు. 'ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్' తర్వాత ఆయన బస్సులో కూచున్నవారి వైపు గర్వంగా చూశాడు. వారు ముందునుంచే ఆయన వైపు కుతూహలంగా చూస్తున్నారు. ముసలాయన ఇలా విజయంగర్వంతో తమవైపు చూడటం, వారికెంతో బాధ కలిగించింది. వారు ముసలాయనలోని అపారమైన ఉత్సాహం, కార్యదక్షత చూసి ఆశ్చర్యపడ్డారు. వారిలో ఒకవిధమైన న్యూనతా భావం మేల్కొంది. ఆ ముసలాయన యెదుట వారు తమని తాము వికలాంగులుగాను, బలహీనులుగాను ఫీలయ్యారు.

బస్సు మౌంటు రోడ్డుమీద వేగంగా పరుగెడుతోంది. ముసలాయన నగర సందడిని చూస్తూ వున్నాడు. ఒకచోట నల్లని పెద్ద అక్షరాలతో రాసిన ప్రకటన ఆయన చదివాడు. 'మాస్కో థౌజండ్ లైట్స్' కొంచెం దూరంలో ఒక పెద్ద దేవాలయం కనిపించింది. దాని ద్వారం మీద ఇలా రాసివుంది 'లార్డ్ శివ టెంపుల్' ఆయన రెండు చేతులు జోడించి నమస్కరించాడు. మిగిలినవారివైపు ఉదాశీనంగా చూశాడు. ఆయన ఒక చౌరస్తాలో ఒక పెద్ద కాంశ్య విగ్రహం చూశాడు. ఆ విగ్రహం కింద చెక్కబడిన అక్షరాలు చదవ లేకపోయాడు. కానీ విగ్రహం ఆకారాన్ని బట్టి అది ఎవరి విగ్రహమో గుర్తించాడు. కొంచెంసేపు మౌనంగా వుండిపోయాడు. ముఖకవళికల్నిబట్టి ఆయన ఏదో పురాతనమైన, అతి పురాతనమైన స్మృతుల్లో మునిగిపోయాడనిపించింది. ప్యాసింజర్లు ఆయన చేష్టల పట్ల, ఆయన ముఖ కవళికల పట్ల ఉత్తేజితులు కాసాగారు.

బస్సు వెళుతోంది. ఆయన నగ రాన్ని పరీక్షిస్తున్నాడు. తోటి ప్రయాణీ కులు ఆయన చేష్టల్ని ఎంతో అసహనంగా సహిస్తున్నారు. వారంతా కలిసి సమయం చూసి ముసలాయన మీద దాడి చేసి పాత వగ తీర్చుకుంటారన్నట్లున్నాయి వారి హావభావాలు. ఒక చోట బస్సు ఆగింది. చిత్రమైన అక్షరాల్లో వున్న ఒక బోర్డు మీద ఆయన చూపు నిలిచింది. అది చైనా లిపి అయివుంటుందని ఆయన ఊహించాడు. పక్కన ఇంగ్లీషులో రాసిన 'చుంగ్-కింగ్-చైనీస్ రెస్టారెంట్'. ఆయన ఊహకు బలాన్నిచ్చింది. ఆయన ఠక్కున రెండోసారి దాన్ని చదివాడు. డ్రైవర్‌ను అడిగాడు, 'ఏమయ్యా, బ్రిటిష్ కౌన్సిల్ లైబ్రరీ ఇంకా రాలేదా?' బస్సులోంచి ఎన్నో స్వరాలు ఒక్కసారిగా వినిపించాయి. 'అయ్యా, స్వామీ! ఎప్పుడో వెళ్ళిపోయింది. రెండు, మూడు స్టాపులు దాటి వచ్చేశాం. ఇక దిగిపొండి'.



'ఓహ్! నగరమెంత మారిపోయింది. ఎంత రద్దీ పెరిగిపోయింది. అరె, నేనెంత మూర్ఖున్ని! యాభై, అరవై సంవత్సరాల క్రిందటికి ఇప్పటికి ఎక్కడైనా పోలిక వుంటుందా? ఐదు సంవత్సరాల కిందటి సంగతే తీసుకుందాం! అప్పుడు నేనే స్వయంగా లైబ్రరీకి వస్తూ వుండేవాన్ని. అక్కడే పుస్తకాలు చదివేవాన్ని. ఇంటికి తీసుకువెళ్ళేవాన్ని కూడా.

'అరె, మీరు చెప్పనుకూడా లేదుకదయ్యా?'

తర్వాత ఆయన ఆ మధ్యవయస్కుని కోసం తన పక్కనున్న అబ్బాయి కోసం చూశాడు. వారిరువురు ఎప్పుడో దిగిపోయారు. అక్కడ సీటు ఖాళీగా వుంది. ఇంతలో కండక్టర్ విజిల్ వేశాడు.

'ఆపండి, ఆపండి! అరె, నన్ను దిగనివ్వండి' అంటూ ఆయన ఎడమచేత్తో పుస్తకాల బండిల్, కుడిచేత్తో ఊతకర్ర పట్టుకుని ఠక్కున నిలబడ్డాడు. తొందరలో ఆయన ధోవతి అంచు కర్ర కిందికి వచ్చింది. ఆయన తొట్రుపాటు పడ్డాడు. డ్రైవర్‌తోసహా ప్రయాణీకులందరూ తమ నవ్వు ఆపుకోలేకపోయారు. దిగిపోయే తొందరలో ఆయన ఎవరి నవ్వునూ గమనించలేదు. ఎవరి సహాయమూ కోరలేదు. ఆయన స్వయంగా తానే పుస్తకాల బండిల్, కర్ర తీసుకుని కిందికి దిగబోయాడు. ఇంతలో డ్రైవర్ కాలితో యాక్సిలేటర్ నొక్కాడు. బస్సు వేగంగా ఊగింది. ముసలాయన తట్టుకుని పడబోయాడు. ఇక ఆయన పడిపోయాడనే అందరూ అనుకున్నారు. కానీ పడబోతూ, పడబోతూ ఆయన నిలదొక్కుకున్నాడు. ఆయన దిగి నిబ్బరంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిచాడు. వారు చూస్తూ వుండగానే లైబ్రరీ వద్దకు చేరుకున్నాడు. ఆనందంగా మెట్లెక్కసాగాడు.

## వైవిధ్యమైన పాత్రల్లో రేఖ

బాలీవుడ్‌లో అమితాబ్ విలక్షణపాత్రల్ని పోషిస్తూ తనదైన శైలిలో ఈతరం ప్రేక్షకుల్ని సైతం ఆకట్టుకుంటుండగా, ఆనాటి హీరోయిన్లలో తన అందచందాలతో ఊగించి శాసించిన రేఖ కూడా విభిన్నమైన పాత్రల ద్వారా ఇంకా ఓ వెలుగు వెలుగుతూనే ఉంది. నటిగా తనది తిరుగులేని స్థానమని నిరూపించుకుంది. ఆ మధ్యన శ్యాం బెనెగల్ 'జుబేదా'లో మనోజ్ బాజ్‌పాయ్ తొలిభార్యగా నటించిన రేఖ ఇటీవల 'లజ్జ' చిత్రంలో అత్యాచారానికి గురైన ఓ దళిత మహిళ పాత్రను పోషించి మెప్పించింది. విషాదానందాల సమ్మేళనమైన జీవితాన్ని తనదైన పద్ధతిలో జీవించడం రేఖ స్వభావం. కనుకనే ఎప్పటికీ హీరోయిన్ పాత్రల్నే పోషించాలని ఆమె తలపోయలేదు. అందుకని అమ్మ, అత్తల పాత్రలకో పరిమితం కాలేదు. నటిగా వైవిధ్యంగల పాత్రల్లో నటిస్తుందామె. ఈమధ్యన విడుదలైన 'లజ్జ' చిత్రంలో రేఖ ప్రతిభాపాటవాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. జీవితాన్ని సృజనాత్మకంగా మలుచుకునే నేర్పు ఉన్న రేఖ నటనలో వైవిధ్యాన్ని కోరుకోవడం సహజం.

